క్లుప్తంగా

పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలి



పరీక్షా పత్రాలను పరిశీలిస్తున్న రాంబాబు

కె.గంగవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను నేర్చుకుంటున్న ప్రతి విద్యార్థి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సర్వశిక్షా అభియన్ మోనిటరింగ్ ఆఫీసర్ రాంబాబు సూచించారు. మండలంలోని కోట పాఠశాలలో జరుగుతున్న యూనిట్ పరీక్షలను మంగళవారం ఆయన పరిశీలించారు. తొలుత విద్యార్థులు రాస్తున్న పరీక్ష పత్రాలను ఆయన పరిశీలించి వారికి సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువులో రాణించడానికి పోటీతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. సులభ పద్ధతిలో విద్యను నేర్చుకునేందుకు ప్రయత్నించాలని సూచించారు.

నేడు అభయాంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ

కె.గంగవరం: మండలంలోని కూళ్ల శివారు మల్లవరంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా రెండు రోజుల నుంచి ఆలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాలతోపాటు, పూజలు నిర్వహిస్తున్నారు. వేద పండితుల బ్రహ్మత్వంలో బుధవారం ఉదయం 7 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు పేర్కొన్నారు. ప్రతిష్ఠ అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

9 మంది జూదరుల అరెస్ట్

కపిలేశ్వరపురం (మండపేట): ద్వారపూడి గ్రామ శివారులో మంగళవారం మండపేట రూరల్ ఎస్సై వి.కిషోర్ తన సిబ్బందితో కలసి పేకాట శిబిరంపై దాడి చేశారు. 9 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,900 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కిశోర్ తెలిపారు.

యువత, మహిళలు రాజకీయాల్లోకి రావాలి

రామచంద్రపురం: దేశ భవిష్యతును నిర్ణయించేది నేటి యువతేనని, మహిళలు, యువత స్వచ్ఛందంగా రాజకీయాల్లోకి రావాలని ప్రముఖ సినీ నటుడు నారా రోహిత్ అన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న విజయ్ ఫంక్షన్ హాల్లో కోనసీమ యూత్ సమ్మిట్ పేరుతో సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నారా రోహిత్, మంత్రి సుభాష్ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. రోహిత్ మాట్లాడుతూ, యువత నచ్చిన రంగాన్ని ఎంచుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పలువురు సీనియర్ నాయకులు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంతరాయ్, మోడ్రన్ డిగ్రీ కాలేజ్ చైర్మన్ జీవీ రావు పాల్గొన్నారు.

ఊరూవాడా ఎగరాలి మువ్వన్నెల జెండా

- దుకాణాల్లో మువ్వన్నెల జెండాలు, దండలు, బ్యాడ్జీలు సిద్ధం
- వేడుకలకు పాఠశాలల ముస్తాబు
- 79వ స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరం

రాయవరం: ఏటా దేశ పౌరులకు పెద్ద పండుగ స్వాతంత్య్ర దినోత్సవం. చిన్నారుల నుంచి పెద్ద వారి వరకు, కుల, మతాలు, భాష, ప్రాంతీయ బేధాలకు అతీతంగా నిర్వహించుకునేది జెండా పండుగ. మండపేట నియోజకవర్గంలోని ఊరూవాడా ఈ వేడుకలను నిర్వహించుకునేందుకు ప్రజలంతా సిద్ధమవుతున్నాయి. స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు చకచకా పూర్తవుతున్నాయి. ఈ నెల 15 శుక్రవారం 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సర్వం సిద్ధం చేసుకున్నాయి. ఉదయం ఏడు గంటల నుంచి ఈ వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలైన వారికి స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు హాజరయ్యే అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు.

వివిధ ఆకారాల్లో

స్వాతంత్య్ర వేడుకల నేపథ్యంలో ఇప్పటికే మార్కెట్‌లో మువ్వన్నెల జాతీయ పతాకాలు కొనుగోలుకు పిల్లలు, పెద్దలు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రధానంగా చేతికి వేసుకునే బ్యాండ్లు, షర్ట్ జేబుకు తగిలించుకునే కాగితపు, ఇనుము, స్టీలుతో తయారు చేసిన బ్యాడ్జీలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. వివిధ రకాల బ్రాస్ మెటల్‌తో చేసిన జెండాలు టేబుల్‌పై ఉండే జెండాలు, కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో కూడిన వివిధ రకాల దండలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి.





మార్కెట్లో ఆకట్టుకుంటున్న మువ్వన్నెల బ్యాడ్జీలు, రిస్ట్ బ్యాండ్‌లు, దండలు



ఘనంగా ఏర్పాట్లు

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రామచంద్రపురం పట్టణాలతో పాటుగా రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల పరిధిలోని 447 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో సుమారుగా 36వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. రెండు నియోజకవర్గాల పరిధిలోని పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు. విద్యార్థులకు జాతీయ గీతాలాపన, పెరేడ్, జెండా వందన సమర్పణలపై తర్ఫీదునిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు ప్రధానోపాధ్యాయులు ఆహ్వానాలు అందజేసేందుకు సిద్ధమవుతున్నారు. అందుబాటు ధరల్లో జెండాలు, బ్యాడ్జీలు ఉండడంతో విద్యార్థులు, యువకులు కొనుగోలు చేసి ధరించడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే విద్యార్థులు తమ తరగతి గదులను రంగు రంగుల జెండాలతో పోటాపోటీగా, అందంగా అలంకరించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

స్వాతంత్య్ర వేడుకల నేపథ్యంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో ఆటల పోటీలు నిర్వహించారు. జెండా పండుగ నేపథ్యంలో ఏటా పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, వారిలోని ప్రతిభను వెలికి తీసి బహుమతులు ఇస్తున్నారు. వివిధ పాఠశాలల్లో కబడ్డీ, ఖోఖో, మ్యూజికల్ చైర్స్, పరుగు పందెం తదితర ఆటల పోటీలను నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా అతిథుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందజేయనున్నారు. క్లస్టర్ పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, ప్రైవేటు సంస్థల వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వైభవంగా పోలమాంబ అమ్మవారి వార్షికోత్సవం



పోలమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

రాయవరం: భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్న రాయవరంలోని పోలమాంబ అమ్మవారి వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను ఏటా శ్రావణమాసంలో వచ్చే మూడవ మంగళవారం రోజున నిర్వహించడం ఆనవాయితీ. వార్షికోత్సవాల్లో భాగంగా ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాయవరం, కొమరిపాలెం, వెదురుపాక, వి.సావరం, లొల్ల, సోమేశ్వరం, అనపర్తి మండలం కొప్పవరం, మహేంద్రవాడ తదితర గ్రామాలకు చెందిన భక్తులు ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారి ఆలయానికి చేరుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద ఏకాహం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన పలు భజన మండళ్ల ఆధ్వర్యంలో ఏకావహం నిర్వహించి భజన పాటలు ఆలపించారు. గ్రామానికి చెందిన ఓంశక్తి సంఘం సభ్యులు, సత్యసాయి సంఘం వారు గీతాపారాయణం చేశారు. శ్రీకష్టుడి విగ్రహాన్ని ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసి భక్తిగీతాలు ఆలపించారు. స్థానిక మహిళలు చేసిన కోలాటం పలువురిని ఆకట్టుకుంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పైడితల్లి, దేశాలమ్మవార్ల వార్షిక వేడుకలు

రాయవరం: సోమేశ్వరంలో కొలువైన పైడితల్లి, దేశాలమ్మవార్ల వార్షిక వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నాగవంశీయులపేటలోని అమ్మవార్ల ఆలయాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు వేడుకలు నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తీన్‌మార్, బ్యాండు మేళాలు, గరగనృత్యాలు తదితర ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. అమ్మవార్లకు పసుపు, కుంకుమ, చలివిడి, పానకాలు, చీర, సారెలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, స్థానిక నేతలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనువిందు.. పల్లె వాతావరణం

కె.గంగవరం: పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అనే నానుడికి రామచంద్రపురం నియోజకవర్గమే నిదర్శనం. అటు జీవన శైలిలోనూ ఇటు పల్లె అందాలలోనూ పట్టణ వాసులకు కనువిందు చేస్తుంది. మానవుని జీవన గమనంలో సుదీర్ఘకాలం పాటు వెన్నంట వచ్చేది పల్లెలు మాత్రమే. ప్రస్తుతం పల్లె వాతావరణం పుడమితల్లికి పచ్చబొట్టు వేసినట్లు కనువిందు చేస్తుంది. వ్యవసాయ పనులు ప్రారంభం అవుతున్న తరుణంలో నల్లగా కనిపించే భూమి మొత్తం వరినాట్లు వేయడం వల్ల పచ్చరంగుతో నిండి ఆహ్లాదాన్ని అందిస్తుంది. ఒకవైపు ఆకాశంలోని మబ్బులతో పల్లె వాతావరణం ఊటీని తలపిస్తోంది.



కె.గంగవరం మండలంలో పచ్చదనంతో ఆకట్టుకుంటున్న పొలాలు

యూత్ సమ్మిట్ పేరుతో ఆడియో ఆవిష్కరణ

రామచంద్రపురం రూరల్: పట్టణంలో మంగళవారం యూత్ సమ్మిట్ పేరుతో చోడవరం బైపాస్ రోడ్డులోని విజయ ఫంక్షన్ హాలులో జిల్లాలోని సుమారు 22 కళాశాలల నుంచి విద్యార్థులను ఉదయాన్నే అక్కడికి తరలించారు. అయితే అక్కడ జరిగింది రోహిత్ నటించిన సుందర కాండ సినిమా ప్రమోషన్ అని అక్కడికి హాజరైన వారు చెబుతున్నారు. సినిమా ట్రైలర్ స్క్రీన్ మీద వేసి విద్యార్థులకు చూపించారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

కపిలేశ్వరపురం (మండపేట): ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం నుంచి రాయితీ సదుపాయం కల్పిస్తున్నామని ఉద్యాన శాఖాధికారి ఎం.అనూష అన్నారు. ఉద్యాన శాఖ, పతంజలి ప్రైవేటు లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో మండపేట మండలం కేశవరంలో మంగళవారం ఆయిల్‌పామ్ విస్తరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉద్యాన శాఖాధికారి ఎం.అనూష తొలి మొక్కను నాటారు. సాగు పద్ధతులు, ప్రభుత్వ రాయితీలపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. మొక్కల నిమిత్తం హెక్టారుకు రూ.29,000 రాయితీ అమలు చేస్తామన్నారు. నాలుగేళ్ల సాగు నిర్వహణ నిమిత్తం హెక్టారుకు సంవత్సరానికి రూ.5,250 చొప్పున నాలుగేళ్లకు రూ.21 వేలు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. అంతర పంటల నిమిత్తం హెక్టారుకు సంవత్సరానికి రూ. 21 వేలు రాయితీ కల్పిస్తామన్నారు. గుంతలు తీసి, మొక్కలు నాటడం డ్రిప్ పద్ధతిలో నీరు పెట్టడమనే పనులను ఉపాధి హామీతో అనుసంధానం అవుతుందన్నారు. డ్రిప్ పరికరాలను ఎస్సీ సామాజిక రైతులకు నూరుశాతం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, పెద్ద రైతులకు 50 శాతం రాయితీపై అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పతంజలి సీనియర్ ఫీల్డ్ అసిస్టెంట్ ఆఫీసర్ బీ సత్యనారాయణ, మేనేజర్ సీహెచ్ అనుతేజ, ఫీల్డ్ ఆఫీసర్ శివసూర్య, విలేజ్ హార్టికల్చరల్ అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు.



కేశవరంలో ఆయిల్‌పామ్ మొక్కను నాటుతున్న హెచ్‌ఓ అనూష

వేలంపాట ఖరారు

కాజులూరు: మండలంలోని ఆర్యావటంలో ఉన్న దేవస్థానం భూమిలో మట్టిదిమ్మ తొలగింపునకు వేలంపాట ఖరారైంది. గొల్లపాలెం వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన 3.5 ఎకరాల మెరక భూమి ఆర్యావటంలో ఉంది. అయితే ఇటీవల మట్టిమాఫియా కన్ను ఈ దేవాలయ భూమిపై పడటంతో స్థానిక నాయకులతో కుమ్మక్కై రాత్రి సమయాల్లో రహస్యంగా తవ్వకాలు చేపట్టారు. స్థానికులు గమనించి ఆందోళనలు వ్యక్తం చేయడంతో రెవెన్యూ అధికారులు తవ్వకాలు తాత్కాలికంగా నిలిపివేశారు. మిగిలిన స్థలంలో మట్టి తీసుకుపోయేందుకు దేవస్థానం అధికారులు మంగళవారం గొల్లపాలెం వేణుగోపాలస్వామి ఆలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన కాదా త్రినాథ్ రూ.14.3 లక్షల హెచ్చు ధరకు పాట దక్కించుకున్నారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులిచ్చిన తర్వాత రెవెన్యూ, మైనింగ్ పరిమిషన్లు తీసుకొని నాలుగు నెలల వ్యవధిలో మట్టి తీసుకెళ్లాలని దేవస్థానం సింగల్ ట్రస్టీ తిరుమల రవితేజ తెలిపారు.



వేణుగోపాలస్వామి ఆలయంలో వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

కాజులూరు: డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత పాటు పడాలని గొల్లపాలెం అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు, స్థానిక ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీ దేవి అన్నారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో అలయన్స్ క్లబ్ సభ్యులు డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువత డ్రగ్స్ బారిన పడితే తనతో పాటు వారి కుటుంబం, తద్వారా సమాజం అధోగతి పాలవుతుందన్నారు. విద్యావంతులైన యువత సన్మార్గంలో పయనించటం ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

కపిలేశ్వరపురం (మండపేట): మత్తు పదార్థాలు జీవితాలను ఛిద్రం చేస్తాయని రామచంద్రపురం ట్రైనీ డీఎస్పీ పి.ప్రదీప్తి హెచ్చరించారు. మండపేట మండలం ఇప్పనపాడులో మంగళవారం మత్తు పదార్థాలు – యువతపై దుష్ప్రభావాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. మండపేట రూరల్ ఎస్సై వి.కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో విద్యార్థులు, యువకులు, గ్రామస్తులు హాజరయ్యారు. డీఎస్పీ ప్రదీప్తి మాట్లాడుతూ దేశంలో మత్తు పదార్థాల విక్రయాలపై పోలీస్ శాఖ దృష్టి సారించిందని తెలిపారు.

ఉచిత వైద్య సేవలు సామాజిక బాధ్యత



మండపేటలో వైద్య శిబిరం ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలందించడం సామాజిక బాధ్యత అని మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కళాశాలలో మంగళవారం శ్రీకర రోబోటిక్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి, రమా డెంటల్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో సుమారు 300 మంది పరిసర ప్రాంతాల పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, అధ్యాపకులు వెంకన్న, డా.మధుకుమార్, రాజేష్, అభినయ్, అంజి పాల్గొన్నారు.

పారదర్శకత కోసం స్వామిత్వ సర్వే

కపిలేశ్వరపురం: పారదర్శకత కోసం స్వామిత్వ సర్వేను నిర్వహిస్తున్నట్లు మండల డిప్యూటీ ఎంపీడీఓ ఈఓపీఆర్‌డీ రాయుడుమోహన్ అన్నారు. కోరుమిల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం స్వామిత్వ సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి దస్తావేజులు, పట్టాల నకళ్లు సేకరించి, ఆస్తి పరిమాణాలకు అనుగుణంగా కొలతలు తీసుకోనున్నట్లు తెలిపారు. రోజుకు 75 ఇళ్లు చొప్పున కొలతలను పూర్తి చేసి సర్వే వివరాలను ఆన్‌లైన్ చేయాలని నిర్దేశించినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై జిల్లాలో 28 పంచాయతీల్లో స్వామిత్వ సర్వే చేపట్టినట్లు తెలిపారు. ఆగస్టు 1న ప్రారంభమైన సర్వే అక్టోబర్ నెలాఖరునాటికి పూర్తికానుందన్నారు. సదస్సులో సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, కార్యదర్శి కామేశ్వరరావు, సర్వేయర్ ప్రశాంత్, డిజిటల్ అసిస్టెంట్ గోపిచందు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు జాతీయ జెండాల పంపిణీ



విద్యార్థులకు జాతీయ జెండాలు అందజేసిన సర్పంచ్

రామచంద్రపురం రూరల్: దేశ ప్రధాని పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండలంలోని హసన్‌బాద జడ్పీ హైస్కూల్‌లో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు మంగళవారం విద్యార్థులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. పాఠశాల ప్రాంగణంలోని స్వాతంత్య్ర సమరయోధులు, సంఘ సంస్కర్తల విగ్రహాలను శుభ్రం చేయించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు వాడ్రేవు వెంకటరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుందరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నులి పురుగులతో చిన్నారులకు అనారోగ్యం

రాయవరం: నులి పురుగులతో అందమైన బాల్యం బక్కచిక్కి పోతోందని, నులి పురుగుల నివారణ ద్వారా విద్యార్థులకు ఆరోగ్యం చేకూరుతుందని రాయవరం, మాచవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు వి.అనిరుధ్, ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నులిపురుగుల నివారణకు మంగళవారం డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశుభ్రత లేకపోవడం, చేతి గోళ్లలో పేరుకున్న మట్టి నోటిలోకి వెళ్లడం, పిల్లలు మట్టి తినడం, కలుషిత నీరు తాగడం, బూజు పట్టిన ఆహారం తినడం, ఉడకని ఆహారం తినడం తదితర కారణాల వలన నులి పురుగులు కడుపులోకి ప్రవేశిస్తాయన్నారు. రాయవరం, మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 70 అంగన్‌వాడీ కేంద్రాలు, 51 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లోని విద్యార్థులు 6,220 మందికి డీవార్మింగ్ మాత్రలను పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పాఠశాలలకు వెళ్లి విద్యార్థులతో మాత్రలు చప్పరించేలా చేశారు. మిగిలిన పిల్లలకు ఈ నెల 20వ తేదీ వరకు మాత్రలు అందజేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: నులిపురుగుల నివారణే లక్ష్యంగా మండపేట నియోజకవర్గంలోని మండపేట పట్టణం, రూరల్ మండలంలోని 12 గ్రామాలు, కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాలు, రాయవరం మండలంలోని 12 గ్రామాల్లో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మండపేట పట్టణంలోని రెండు అర్బన్ పీహెచ్‌సీలు, ద్వారపూడి, కేశవరం పీహెచ్‌సీల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలను అందజేశారు. కమ్యూనిటీ పారామెడిక్స్ హెల్త్ కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ) నాయకులు కొన సత్యనారాయణ తదితరులు మండపేట రాజీవ్ గృహ కల్ప కాలనీలో మాత్రల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వెలగతోడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య ఆరోగ్య కార్యకర్తలు నులిపురుగుల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు.



లొల్ల పాఠశాలలో విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు ఇస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

కపిలేశ్వరపురం మండలం అంగర పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారి పీఎస్ఎన్‌డీ రత్నకుమారి పర్యవేక్షణలోని సిబ్బంది పీహెచ్‌సీ పరిధిలోని 15 ప్రభుత్వ పాఠశాలలు, 8 ప్రైవేటు పాఠశాలలు, ఒక జూనియర్ కళాశాల 28 అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. 1–19 సంవత్సరాల చిన్నారులు 3,865 మందికి 3,528 మందిచే మాత్రలను మింగించి 91.3 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీహెచ్ఎస్ జిత్తుక మల్లిఖార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఆఫీసర్ బి.రామారావు, హెల్త్ విజిటర్ తాతపూడి మేరీమణి, సూపర్‌వైజర్ ఎం.నానిబాబు, ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో మంగళవారం నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. దంగేరు, పామర్రు, కుందూరు, పేకేరు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌యంలు, ఆశా కార్యకర్తలు పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి వారి చేత మింగించారు. దంగేరు, కుందూరు, పేకేరు పాఠశాలల్లో జరుగుతున్న నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నోడల్ ఆఫీసర్, డీఎంఓ వెంకటేశ్వరరావు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకటి నుంచి 18 ఏళ్ల వయసున్న ప్రతి ఒక్కరూ ఈ మాత్రలను వేసుకోవాలన్నారు. వీటి ద్వారా కడుపులోని నులిపురుగులను నివారించుకోవచ్చని, తద్వారా విద్యార్థులకు మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని సూచించారు. అనంతరం ఆయా పీహెచ్‌సీల్లో మాత్రల పంపిణీ కార్యక్రమంపై సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు.

రామచంద్రపురం రూరల్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని మండలంలో 95 శాతం ఆల్బెండజోల్ మాత్రలు చిన్నారులతో మింగించినట్లు జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని వెల్ల, ద్రాక్షారామ పీహెచ్‌సీల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని ఆయన పరిశీలించారు. ద్రాక్షారామలోని అంబేడ్కర్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలను ఆయన పరిశీలించి విద్యార్థులతో మాత్రలు మింగించారు. వెల్ల పీహెచ్‌సీ పరిధిలో 2,731 మంది చిన్నారులకు 2,589 మందికి, ద్రాక్షారామ పీహెచ్‌సీ పరిధిలో 8,410 మందికి 7,990 మందికి మొత్తం రూరల్ మండలంలో 95 శాతం చిన్నారులకు మాత్రలు మింగించడం జరిగిందన్నారు. మిగిలిన వారికి ఈ నెల 20న మాప్‌అప్ నిర్వహించి పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీల వైద్యాధికారులు స్వాతి భవాని, లక్ష్మీ ప్రసన్న, డివిజనల్ సూపర్‌వైజర్ కమల్ శేషు, మలేరియా సబ్ యూనిట్ అధికారి బిషప్, సీహెచ్ఓ వీరవేణి, సూపర్‌వైజర్లు రత్నం, శ్రీనివాస్, వరలక్ష్మి, సీహెచ్ఓలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది నులు పురుగు మాత్రలు వేశారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి బాలికలకు నులుపురుగుల మాత్రలు వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్బన్ పీహెచ్సీ డాక్టర్ హేమ సుధీర్ మాట్లాడుతూ, నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, ఆకలి మందగించడం, కడుపునొప్పి వస్తుందని, వీటికి నివారణకు ఈ మాత్రలను 1–19 ఏళ్ల వయసు ఉన్న పిల్లల చేత మింగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ పీహెచ్సీ డాక్టర్ వీరభద్రా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు గోపికృష్ణ, శివారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ మరియమ్మ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



వెలగతోడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు



ద్రాక్షారామలో విద్యార్థికి మాత్ర వేస్తున్న వెంకటేశ్వరరావు



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి